క్లుప్తంగా

కొనసాగుతున్న స్వచ్ఛతా అభియాన్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. ఆగస్టు 1వ తేదీన డివిజన్ పరిధిలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా పలు స్టేషన్లలో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వే పరిసరాలను ప్లాస్టిక్, చెత్త, మురికి లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా రైల్వే ప్రయాణికులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు పారిశుధ్య, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ట్రాక్‌లపై చెత్త సేకరణ, టాయ్‌లెట్లు, వెయిటింగ్ హాళ్లు, విశ్రాంతి గదులు, కేటరింగ్ స్టాళ్లు, కార్యాలయాల పరిశుభ్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. పలు స్టేషన్లలో, రైల్వే కాలనీల్లో స్వచ్ఛతా ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రైల్వే ఉద్యోగులు, వివిధ స్వచ్ఛంద సంస్థల వలంటీర్లు, స్వచ్ఛ సేవకులు పాల్గొన్నారు.

తల్లిపాలతో చిన్నారులకు ఆరోగ్యం



కరపత్రాలతో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, డాక్టర్ మనోజ్

సీతంపేట : అప్పుడే పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించాలని నరసింహనగర్ ఆరోగ్య కేంద్ర వైద్యులు మనోజ్ సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. న్యుమోనియా, అతిసార బారిన పడకుండా తల్లిపాలు రక్షణ కల్పిస్తాయన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు బిడ్డకు తాగించాలని, ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలన్నారు. అనంతరం సంబంధిత ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు.

బూత్ ఏజెంట్లను నియమించాలి

తాటిచెట్లపాలెం : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా పరిశీలన, పోలింగ్ స్టేషన్ పునః ఆయోజన అంశంపై ఉత్తర నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం సీతమ్మధారలో గల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్‌వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి అధ్యక్షత వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీలు వెంటనే తమ బూత్ ఏజెంట్లను నియమించాలని ఆమె సూచించారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక దొంగ ఓట్లు ఉన్నాయని, వాటిని ఇంటింటికీ వెళ్లి పరిశీలించి తొలగించాలని కోరారు. సమావేశంలో నజీర్, రాంబాబు, శంకర్, శ్రీహరి పాల్గొన్నారు.

ఆహారం పంపిణీ



ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న సభ్యులు

కంచరపాలెం : సమాజ సేవలో భాగంగా సంపత్ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన కింద, జ్ఞానాపురం రైల్వే స్టేషన్, దొండపర్తి, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, ఎన్‌ఏడీ తదితర ప్రాంతాల్లో ఆహార పొట్లాలు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శరగడం వెంకటలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఎ.లక్ష్మి, కార్యదర్శి ఎం.హేమలత, ఎస్.సునీత, కె.శకుంతల, ఎల్.సావిత్రి, జి.కనకమహాలక్ష్మి, బి.అచుత, జి.శాంతి, కనకరెడ్డి, ఎం.హరి, హెచ్.కోటి పాల్గొన్నారు.

4 వేల మంది పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు

అల్లిపురం: పోలీస్ కమిషనరేట్‌కు చెందిన సుమారు 4 వేల మంది పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ×వార్షిక పోలీసు ఆరోగ్య పరీక్ష 2.0×కార్యక్రమం మంగళవారం కేజీహెచ్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ప్రతి రోజూ సుమారు 120 నుండి 150 మంది పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగించనున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీసులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.



పూజలందుకుంటున్న వరలక్ష్మి అమ్మవారు

శుభప్రదం.. వరలక్ష్మి వ్రతం

• కళకళలాడుతున్న మార్కెట్లు • అమాంతం పెరిగిన ధరలు • మార్కెట్లకు శ్రావణ శోభ



కంచరపాలెం జాతీయ రహదారిలో పూల విక్రయాలు



కంచరపాలెం మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి

కంచరపాలెం: మహిళలకు మంగళప్రదమైనది శ్రావణ మాసం. ఈ మాసంలో శ్రావణలక్ష్మి సర్వాభరణ అలంకరణతో తేజోవంతంగా సాక్షాత్కరిస్తుంది. సకల సంపదలకు ఈ మాసం మహోదయం. అత్తవారిళ్లల్లో కొత్త కోడళ్ల కొంగొత్త ఆశలకు ఈ మాసం ఆశాజనకంగా అలరారుతుంది.

కళకళలాడుతున్న దుకాణాలు

శ్రావణ మాసంలో పదిహేను రోజుల ముందు నుంచే వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తాయి. మహిళలు వారి స్థోమతను బట్టి కొత్త చీరలు కొని, శ్రావణ లక్ష్మికి చూపించి కట్టుకుంటారు. బంగారం ధర చుక్కల్ని తాకుతున్నా వరలక్ష్మీ వ్రతం నాడు అంతో ఇంతో పసిడిని శ్రావణలక్ష్మికి చూపించి ధరించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ మాసంలో బంగారం దుకాణాలకు భలే గిరాకీ అని చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో కంచరపాలెం పరిసర ప్రాంతాల్లోని వస్త్ర, బంగారం దుకాణాలు కళకళలాడుతున్నాయి.



ఘుమఘుమలాడే పిండి వంటలు

ఆలయాల్లో మంగళగౌరీ వ్రతాలు

ఈ మాసంలో దేవాలయాలు, అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కళకళలాడుతుంటాయి. నిత్యం విశేష పూజలు, కుంకుమార్చనలతో విరాజిల్లుతాయి. ప్రధానంగా కంచరపాలెం, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి, మర్రిపాలెం, మురళీనగర్, మాధవధార, అక్కయ్యపాలెం, సీతంపేట, సీతమ్మధార, జ్ఞానాపురం, ఎన్‌ఏడీ కొత్తరోడ్డు తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో మంగళ, శుక్రవారాలు అమ్మవారికి మంగళగౌరీ వ్రతాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతాయి.

పిండి వంటలతో ఘుమఘుమలు

ఈ మాసంలో ప్రతి ఇంట మంగళ, శుక్రవారాలు పిండి వంటల ఘుమఘుమలు నోరూరిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు ఎలా ఉన్నా అనాదిగా వస్తున్న ఆచారాన్ని కాదనలేం అని అంతా అంటారు. ప్రతి ఒక్కరూ తోచిన రీతిన పిండి వంటలు తయారు చేసి ఇరుగు పొరుగు వారికి పంచుకుని సంప్రదాయాన్ని చాటుకుంటారు.

ధరలు బాగా పెరిగాయి



సంప్రదాయ పండగల్లో వరలక్ష్మీ వ్రతం ఒకటి. వ్యాపారులు అవకాశం చూసి అమాంతం ధరలు పెంచేశారు. ధరలెలా ఉన్నా పండగలు చేసుకోవడం తప్పదు కదా. మార్కెట్‌లో ఏ వస్తువు కొనాలన్నా ధర చూసి భయమేస్తోంది. ఈ ఏడాది వరలక్ష్మి పండగకు అన్నీ సిద్ధం చేసుకున్నాం.
– కొరువాడ ప్రసన్నకుమారి, ఊర్వశి కూడలి

ఇళ్లన్నీ దేవాలయాల్లా కనిపిస్తాయి



వరలక్ష్మి వ్రతం నాడు ఇళ్లన్నీ దేవాలయాల్లా కనిపిస్తాయి. శ్రావణమాసంలో మంగళ, శుక్రవారాల్లో మంగళగౌరీ వ్రతాలు జరుపుకుంటాం. ఈ ఏడాది పూజా సామగ్రి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏదీ కొనలేకపోతున్నాం. అయినా ఆచారం కనుక తప్పదు.
– చెల్లబోయిన స్వాతి వేణి, కంచరపాలెం

తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్



సమావేశంలో పాల్గొన్న ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో గల విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యులు డి.సుధీర్ మాట్లాడుతూ ప్రస్తుతం తల్లిపాల వారోత్సవాలు జరుగుతున్నాయని, ప్రతి సచివాలయం పరిధిలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు వివరించాలన్నారు. మలేరియా సూపర్ వైజర్ గొర్లె లక్ష్మణ్ మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా క్షేత్ర స్థాయిలో ఫ్రైడే డ్రైడే సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఏఎన్‌ఎంలు, ఆశాలు అవగాహన కల్పించాలని కోరారు. రేసపువానిపాలెంలో గల స్వర్ణభారతి పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే సమావేశంలో హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డి మలేరియా, డెంగ్యూ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంవో కార్యాలయ సిబ్బంది కోట్ని శ్రీనివాసు, ల్యాబ్ టెక్నీషియన్ పి.కామరాజు, ఏఎన్‌ఎంలు కరుణ కుమారి, రామలక్ష్మి, భాగ్యలక్ష్మి, రాణి, వెంకటలక్ష్మి, కమల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాల్వలో పూడిక తొలగించండి



పిచ్చిమొక్కలతో పూడుకుపోయిన కాల్వ

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో కాల్వలు పూడుకుపోవడంతో వర్షం నీరు, మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాలతో పాటు, ఆలయం ఎదురుగా ఉన్న రహదారిని అనుకున్న కాల్వలు పిచ్చిమొక్కలు, చెత్తతో నిండి ఉన్నాయి. దీని వల్ల ఎగువ నుంచి వచ్చే మురుగునీరు, వర్షం నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. కాల్వల పక్కన పెరిగిన మొక్కలను పారిశుధ్య సిబ్బంది తొలగించడం లేదు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ సమస్య పరిష్కారం కావడంలేదు. దీనిపై అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత బస్సు సౌకర్యంతో ఆటో డ్రైవర్లకు నష్టం



ధర్నాలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన ఆటో డ్రైవర్లను ఆందోళనకు గురిచేస్తోందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంపై ప్రభుత్వం పునరాలోచన చెయ్యాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ మంగళవారం గురుద్వారా కూడలిలో ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల ఆటో, వ్యాన్, జీపు, కారు డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే డీజిల్, పెట్రోల్ ధరలు, విడిభాగాల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో రోజంతా ఆటో నడిపినా పూట గడవడం కష్టంగా ఉందన్నారు. దీనికితోడు ఉబర్, ఓలా, రాపిడోతో ఉపాధి కోల్పోతున్నామని, ఇటువంటి సమయంలో ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంపై పునరాలోచన చెయ్యాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రావికృష్ణ, దేవుడు, రాంబాబు పాల్గొన్నారు.

ఎంవీవీ స్మారక పురస్కారాలు ప్రదానం



రచయిత మంజరిని సత్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, తదితరులు

సీతంపేట: రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఎం.వి.వి.సత్యనారాయణ స్మారక పురస్కారాల ప్రదానోత్సవ సభ మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథులుగా హాజరైన గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, మేడా మస్తాన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రముఖ కథా రచయిత మంజరి (గంధం నాగేశ్వరరావు), ప్రముఖ విద్యా వేత్త డాక్టర్ కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణ మూర్తికి స్మారక పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ పోలీస్ అధికారిగా ఉద్యోగం చేస్తూ తన విధుల్లో ఎదురైన సంఘటనలను కథలుగా మలిచి పాఠకుల మదిలో సుస్థిర స్థానం సంపాదించిన రచయిత మంజరిని స్మారక పురస్కారానికి ఎంపిక చేసిన ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులను అభినందించారు. అలాగే విద్యావేత్త, సామాజిక వేత్త, ఎందరికో ఉచితంగా విద్యను అందించిన కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణ మూర్తికి స్మారక పురస్కారం అందజేయడం ప్రశంసనీయమన్నారు. పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాలన్నారు. పిల్లలను కథల వైపు మళ్లించాలని సూచించారు. యువతలో రచయితలు అరుదుగా కన్పిస్తున్నారని, రచయితలను ప్రోత్సహించేలా ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలన్నారు. కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ రచయిత సమాజానికి మార్గదర్శి అని, పాఠకులను ప్రభావితం చేసేలా రచనలు ఉండాలన్నారు. ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ఎంవీవీ నాస్తికులని, జై ఇన్సాన్ అన్నది వారి నినాదమన్నారు. సత్యాన్వేషణలో మానవత్వం ముఖ్యమన్నారు. అనంతరం పురస్కారాల గ్రహీతలను దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంవీవీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు అతనితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

సముద్రపు నాచు పెంపకంపై శిక్షణ



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు



సముద్రపు నాచు ఉత్పత్తుల గురించి మత్స్యకారులకు వివరిస్తున్న అధికారులు

మహారాణిపేట: సముద్రపు నాచు పెంపకంపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకార యువతీ, యువకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. బీచ్ రోడ్డులో ఉన్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ (సిఫ్ నెట్) కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. నాచు పెంపకానికి అనువైన ప్రాంతాల్లో ఈ శిక్షణ ఇస్తామన్నారు. సముద్రపు నాచులో అనేక రకాలు ఉన్నాయని, ట్యూబ్, రాఫ్ట్ పద్ధతిలో నాచు పెంపకం, సముద్రపు నాచు ఎండబెట్టడం వంటి వాటిలో శిక్షణ ఇవ్వడమే కాకుండా మార్కెటింగ్‌పై కూడా అవగాహన కల్పిస్తామన్నారు. దీనిపై మత్స్యకార యువతకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేస్తామన్నారు. సీఎఫ్‌నెట్ ఇన్‌చార్జి డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ సముద్రపు నాచుతో తయారు చేసే పలు ఆహార ఉత్పత్తుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ మేఘరాజన్, డిప్యూటీ డైరెక్టర్ హెచ్.బిషోయ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ (ఎన్ఐఎఫ్‌పీహెచ్ఏటీటీ) డి.డి. డాక్టర్ మీనా కోటేశ్వరరావు, డాక్టర్ రమ్య, మత్స్యశాఖ ఏడీ విజయకృష్ణ, ఎఫ్‌డీవో ఆశాజ్యోతి, డీసీఎం కృష్ణ, గరికిన రవి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలి



ట్రైనర్లతో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

మహారాణిపేట: త్వరలో జరగనున్న నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్ (ఎన్‌సీడీ) కోసం హౌస్ హోల్డ్ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి అన్నారు. మంగళవారం ఆంధ్రా మెడికల్ కాలేజీలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా సర్వే చేయాలన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ ఈ సర్వేకు సంబంధించి ఎలాంటి సమాచారం కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి, అంకాలజీ యూనిట్ నోడల్ అధికారులు డాక్టర్ కె.సాయి సుష్మ, డాక్టర్ పి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో శ్రావణ పౌర్ణమి పూజలు

సీతంపేట : శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా ఈ నెల 9న అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా శనివారం ఉదయం 7 గంటలకు కల్యాణ వేంకటేశ్వర స్వామికి విశేష అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే లలితా అమ్మవారి సన్నిధిలో శ్రీచక్ర నవావరణ, ఉదయం 9 గంటలకు మణిద్వీపంలో శ్రీచక్ర నవావరణ నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు హయగ్రీవ జయంతి సందర్భంగా హయగ్రీవులకు విశేష అభిషేకం నిర్వహిస్తామని, పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

విశాఖ మ్యూజియం సందర్శన

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు మంగళవారం విశాఖ మ్యూజియంను సందర్శించారు. చరిత్ర, రాజనీతి, అర్థశాస్త్ర విభాగం విద్యార్థుల్లో చారిత్రక జ్ఞానం, సంస్కృతిక వారసత్వం పట్ల అవగాహన పెంపొందించేందుకు మ్యూజియంను సందర్శించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. 98 మంది విద్యార్థినులు 4 బృందాలుగా పాల్గొన్నారు. మ్యూజియంలో భారతదేశ చారిత్రక వారసత్వానికి సంబంధించి పలు పురాతన వస్తువులు, నౌకాదళ సామగ్రి, గడియారాలు, పురాతన కరెన్సీ వంటివి విద్యార్థులు వీక్షించారు. అధ్యాపకులు కె.గీతాంజలి, ఎస్.రాజేష్, డాక్టర్ బి.నాగమణి, జి.జ్యోతి పాల్గొన్నారు.

తీరంలో మందుబాబుల హల్‌చల్



యోగా విలేజ్ వద్ద మద్యం సీసా



పోలీస్ మెస్ చేరువలో మద్యం సీసా

- ఎక్కడికక్కడ తాగిపడేసిన మద్యం సీసాలు
- వాకర్స్, పర్యాటకులకు ఇబ్బందులు

ఏయూ క్యాంపస్ : సాగర తీరం రాత్రివేళల్లో మద్యం ప్రియులకు నిలయంగా మారిపోతోంది. రాత్రి పది గంటలు దాటితే బీచ్‌లో జన సంచారం మెల్లగా తగ్గిపోతుంది. దీంతో మందుబాబులు ఆ సమయంలో సాగర తీరంలో మందు పార్టీలు చేసుకోవడానికి అనువుగా మార్చుకుంటున్నారు. తీరంలోని ఇసుక తిన్నెలపైన, విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద, యోగా విలేజ్, పోలీస్ మెస్ ఎదురుగా ఉన్న లాన్‌లలో రాత్రివేళల్లో మద్యం సేవిస్తున్నారు. ఉదయాన్నే వాకింగ్‌కి వచ్చేవారికి మందుబాబులు తాగిపడేసిన సీసాలు, తిని పడేసిన భోజనం కవర్లు దర్శనమిస్తున్నాయి. నిత్యం వేలాది మంది పర్యాటకులు, నగరవాసులు సంచరించే, అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతాలను మందు బాబులు అడ్డాగా మార్చుకుంటున్నారంటే నగరంలో శాంతి భద్రతల పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పోలీసుల పర్యవేక్షణ లోపం, తగినంత స్థాయిలో విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు లేని కారణంగా ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని నగరవాసులు అంటున్నారు. తీరంలో ఇటువంటి చర్యల ఫలితంగా నగరానికి చెడ్డపేరు వచ్చే పరిస్థితి ఉంది. మద్యం సేవించిన వారు ఎవరిపైనైనా దాడి చేసినా, అఘాయిత్యాలకు పాల్పడినా సమస్య పెద్దదయ్యే అవకాశం ఉంది. ఇటువంటి వాటికి ఆదిలోనే అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. రాత్రివేళల్లో భద్రతా సిబ్బందిని పెంచడం, సాగరతీరంలో, లాన్‌లలో మరిన్ని విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించాలి. అదేవిధంగా మందు బాబులను కట్టడి చేసేందుకు వారు మద్యం సేవించే ప్రాంతాలపై పోలీసులు ఆధునిక డ్రోన్‌ల సహాయంతో పహారా నిర్వహించడం అవసరమని నగరవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నగర ప్రతిష్టను పెంచే విధంగా పోలీసు, ప్రభుత్వ అధికారులు ప్రణాళికతో పని చేయాల్సిన అవసరం ఉంది.

సాంస్కృతిక పునరుజ్జీవనం కోసమే సీవీ రచనలు



మాట్లాడుతున్న ఆచార్య కేఎస్ చలం

సీతంపేట: సమతా సాహితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం ప్రముఖ రచయిత చిత్తజల్లు వరహాలరావు (సీవీ) సాహిత్యంపై పరామర్శ సభ నిర్వహించారు. రచయిత డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో యూపీఎస్సీ పూర్వ సభ్యులు ఆచార్య కె.ఎస్.చలం మాట్లాడుతూ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం సీవీ రచనలు సాగించారన్నారు. డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ సీవీ రచనల్లోని సామాజిక విషయాలపై ప్రసంగించారు. డాక్టర్ క్షేత్రపాల్ రెడ్డి మాట్లాడుతూ సీవీ రచనల ప్రాసంగిత నేటికీ అవసరమన్నారు. డాక్టర్ బండి సత్యనారాయణ మాట్లాడుతూ సీవీ సాహిత్యం మీద విస్తృత ప్రచారం, పరిశీలన అవసరమన్నారు. కార్యక్రమంలో రచయితలు ఉప్పల అప్పలరాజు, డి.వి.సూర్యారావు, వేమన, మహేష్, చిన్నారావు పాల్గొన్నారు.

ప్రేమసమాజం సేవలు మహోన్నతం

అల్లిపురం: ప్రేమ సమాజం కుష్టు శరణాలయ 71వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్, ట్రస్టీ ఎన్.ఎస్.రాజు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రేమసమాజం చేపడుతున్న సేవలన్నింటి కంటే కుష్టు రోగులకు ఆశ్రయం కల్పించి వారికి సేవలందించడం అన్నింటికంటే మహోన్నతమైనదని తెలిపారు. సభాధ్యక్షుడు కేశప్రగడ నరిసింహమూర్తి మాట్లాడుతూ ప్రేమ సమాజం 1955 నుంచి కుష్టు వ్యాధితో బాధపడుతున్న అనేక మంది రోగులను అక్కున చేర్చుకుని వారికి ఆశ్రయం కల్పిస్తూ, సపర్యలు చేస్తుందన్నారు. 1956లో చెవిడి రాణి ప్రేమసమాజం చేస్తున్న సేవలను గుర్తించి ఏవీఎన్ కళాశాల దరి స్థలాన్ని ఉచితంగా అందించారని తెలిపారు. 200 మంది రోగులతో ప్రారంభమైన ఈ సంస్థలో ఇప్పుడు పది మంది మాత్రమే మిగిలారన్నారు. మిగిలినవాన వారు ప్రేమసమాజం సేవల వల్ల కోలుకుని ఇళ్లకు వెళ్లిపోవడం గర్వకారణం అన్నారు. అనంతరం కుష్టు శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి అతిథులు నూతన వస్త్రాలు అందజేశారు.

28 నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఎఫ్‌డీపీ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై వారం రోజులపాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వహించనున్నామని ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఎఫ్‌డీపీ నిర్వహించనున్నామని వీసీ పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ సిస్టం ఇంజినీరింగ్ విభాగ సమావేశ మందిరంలో దీనిని నిర్వహిస్తామని తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో బోధనా సిబ్బంది, పరిశోధకులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రంగంలో అధ్యాపకుల నైపుణ్యాలను మరింత పెంపొందించడం, వర్తమాన సమాజ అవసరాలు, సమస్యలకు పరిష్కారాలు అన్వేషించే దిశగా పనిచేయడంపై శిక్షణ ఇస్తామన్నారు. ఎఫ్‌డీపీకి ఐఐటీ ఆచార్యులు, ఎన్ఐఎస్ఈఆర్ భువనేశ్వర్‌కు చెందిన శాస్త్రవేత్తలు, విభిన్న పరిశ్రమల నిపుణులు పాల్గొని శిక్షణ అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, కార్యక్రమాల కన్వీనర్ కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.